పత్రికా ప్రకటన - 3

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 31.07.2014

తెలంగాణ ప్రాంతంలో అపారమైన ఖనిజ నిక్షేపాలు వున్నాయని వాటిని వెలికితీసి పరిశ్రమలు నెలకొల్పాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. వెంటనే తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కూడా సూచించారు. తెలంగాణలోని సహజ వనరులు, మానవ వనరులను పూర్తి స్థాయిలో ఉపయోగించుకొనే విధంగా పారిశ్రామిక విధానం వుండాలని చెప్పారు.

సచివాలయంలో గురువారం పారిశ్రామిక విధానంపై సమీక్ష జరిగింది. ప్రభుత్వ సలహాదారు బివి.పాపారావు, సిఎంఒ ముఖ్య కార్యదర్శి ఎస్.నర్సింగ్ రావు, పరిశ్రమల శాఖ కార్యదర్శి ప్రదీప్ చంద్ర, టిఎస్ఐఐసి ఎండి జయేష్ రంజన్ తదితరులు ఇందులో పాల్గొన్నారు. తెలంగాణలోని చాలా జిల్లాల్లో ఖనిజాలు వున్నాయని చెప్పారు. వాటిని గుర్తించి వెలికితీసి ఉపయోగంలోకి తేవాలన్నారు. సమైఖ్య ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణలోని ఖనిజాలు, గనులను నిర్లక్ష్యం చేశారన్నారు. వరంగల్-ఖమ్మం సరిహద్దులోని లక్షా యాభై వేల ఎకరాల్లో అపార ఖనిజ సంపద వుంటే అది పనికిరానిదని సీమాంధ్ర పాలకులు దుష్ప్రచారం చేశారని చెప్పారు. కాని ఇటీవలే స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా అక్కడ 30 వేల కోట్లతో స్టీల్ ఫ్యాక్టరీ పెట్టడానికి ముందుకు వచ్చిందని, బయ్యారం ఇనుప ఖనిజం చాలా ఉపయుక్తమని చెప్పిందని వెల్లడించారు. ఇలా తెలంగాణలో సహజ వనరులున్నాయన్నారు. లైఫ్ సైన్సెస్, ఐటి హార్డ్‌వేర్, ఫుడ్ ప్రాసెసింగ్, డిఫెన్స్, కాటన్, స్పిన్నింగ్, లెదర్, మైన్స్, మినరల్స్, వేస్ట్ మేనేజ్‌మెంట్, ప్లాస్టిక్ పాలిమర్, కెమికల్, జేమ్స్, పెరల్స్, జ్యూవెలర్స్, ఆటోమోబైల్స్ తదితర రంగాల్లో పరిశ్రమల ఏర్పాటుకు గల అవకాశాలపై సమీక్ష జరిగింది. తెలంగాణలో సింగిల్ విండో, చేజింగ్ సెల్‌తో కూడిన పారిశ్రామిక విధానం తేవడంతో పాటు ప్రతి రంగానికి సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటు చేసేటప్పుడు వేరువేరు పద్ధతులు అవలంభించాల్సి వుంటుంది కాబట్టి విభాగాల వారిగా విధి విధానాలు కూడా తయారు చేసుకోవాలని సమీక్షలో నిర్ణయించారు.

పారిశ్రామిక రంగానికి సంబంధించి ప్రస్తుతం వున్న చట్టాలు, విధానాలపై క్షుణ్ణంగా సమీక్ష జరిపి మార్పులు చేర్పులు చేయాలని, అవసరం అనుకుంటే పాత చట్టాలను పూర్తిగా తొలగించి కొత్త చట్టాలు తేవాలని కూడా ముఖ్యమంత్రి చెప్పారు. హైదరాబాద్‌లో ఇక్రిశాట్,

డిఆర్‌డిఎ, ఐఐటి లాంటి పరిశోధనా సంస్థలతో పాటు అనేక ఇంజనీరింగ్ కాలేజిలు వున్నాయని, వాటిని పరిశ్రమలతో అనుసంధానం చేయాలని సిఎం సూచించారు. కాలేజిల్లో చదివే విధ్యార్థులు పరిశ్రమలలో ప్రాక్టికల్స్ చేసే విధంగా విధానం రూపొందించాలని చెప్పారు. దీనివల్ల విద్యార్థులకు విద్య, జ్ఞానంతో పాటు అనుభవం కూడా వస్తుందని, పరిశ్రమలకు కావలసిన వృత్తి నైపుణ్యం వున్న మానవ వనరులు అందుబాటులో వుంటాయని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాల్లో రీసర్చ్ కారిడార్ వ్యవస్థ వున్నదని, తెలంగాణలో కూడా అలాంటి వ్యవస్థను ప్రభుత్వమే చొరవ చూపి ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. టిఎస్ఐఐసిని బలోపేతం చేయాలని, ఐదు లక్షల ఎకరాల భూమిని ఈ సంస్థకు అప్పగించడం ద్వారా పారిశ్రామిక వాడల అభివృద్ధికి నిధులు సమకూర్చుకోవడం తేలిక అవుతుందని, చాలా కొద్ది సమయంలోనే టిఎస్ఐఐసి ఓ బలమైన ఆర్థిక సంస్థగా కూడా మారుతుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ఫార్మా సిటీతో పాటు కెమికల్ సిటి కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఐటిఐఆర్ ప్రాజెక్టును కూడా హైదరాబాద్ మాస్టర్ ప్లాన్‌కు అనుసంధానం చేసి సమగ్రంగా తయారు చేయాలని సూచించారు. భవిష్యత్తులో తెలంగాణ వ్యాప్తంగా సీడ్ కాలనీలు ఏర్పాటు చేయాలని, వివిధ రకాల పంటలతో పాటు విత్తనోత్పత్తికి ప్రోత్సహించాలని, తద్వారా తెలంగాణలో ఆగ్రో ఇండస్ట్రీస్ విరివిగా వస్తాయని చెప్పారు.

సిని పరిశ్రమకు చేదోడు వాదోడుగా వుండటంతో పాటు స్థానికులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు దొరికే విధంగా తెలంగాణలో రెండు వేల ఎకరాలలో సినిమా సిటి నిర్మించాలని ముఖ్యమంత్రి సంకల్పించారు. సినిమా పరిశ్రమ హైదరాబాద్ నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ తరలిపోదని హైదరాబాద్ లాంటి మంచి వాతావరణం వున్న నగరం ఎక్కడా దొరకదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. సినిమా షుటింగులు, టివిసీరియల్ల నిర్మాణం హైదరాబాద్‌లో ఎక్కువగా జరుగుతోందని దానికి అనుగుణంగా సినిమా సిటి నిర్మించాలని చెప్పారు. గ్రాఫిక్స్, ఎఫెక్ట్స్ లాంటి సాంకేతిక అంశాలకు సంబంధించిన స్టూడియోలు కూడా సినిమా సిటిలో వుండాలన్నారు.

---

**సిపిఆర్ఓ టు సిఎం.**